హరి కాంభోజి - ఆది

నిత్యపూజలివివో - నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టి - పరమాత్మునికి

తనువే గుడియట - తలయే శిఖరమట
పెను హృదయమే - హరిపీఠమటా
కనుగొన చూపులె - ఘన దీపములట
తన లోపలి యం - తర్యామికిని

పలుకే మంత్రమట - పాదైన నాలికే
కలకలమను పిడి - ఘంటయట
నలువైన రుచులే - నై వేద్యములట
తలపులోపల నున్న - దైవమునకు

గమన చేష్టలే యం - గ రంగ గతియట
తమి గల జీవుడె - దాసుడట
అమరిన వూర్పులే - యాల వట్టములట
క్రమముతో శ్రీవేం - కట రాయనికిని

శంకరులు శివమానసిక పూజాస్తోత్రంలోని ఈ శ్లోకంలో

ఆత్మాత్వం గిరిజామతి, పరిచరాః ప్రాణాః శరీరం గృహం
పూజాతే విషయోప భోగ రచనా నిద్రా సమాధి స్థితి
సంచారః పదయోః ప్రదక్షిణ విధిః స్తోత్రాణి సర్వాగిరో
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభోతవారాధనం

అన్నట్లు ఈ సంకీర్తనను సంతరించారు సంకీర్తనాచార్యులు. (ఆయనే శంకరులు గదా) నా ఆత్మ నీవు, నా మతి పార్వతి, నా పంచప్రాణాలు పరిచారకులు. నాకేయే విష యాలయందాసక్తి కలిగినదో అవన్నీ నీకు పలుపూజలు. సమాధి స్థితిని చేరినది నేను నిద్రించినప్పుడు. నా పాదాలు భూమిని సంచరించినదంతా నీకు ప్రదక్షిణములే. నా పలి కిన పలుకులన్నీ నీ స్తోత్రములే. నేనెప్పుడు యెక్కడ ఏయే కర్మలొనరిస్తే అవన్నీ నీకు నే

చేసే ఆరాధనలే అని శ్లోక తాత్పర్యం. శ్రీ శంకరులు ప్రధమా విభక్తిలో చెప్పిన శ్లోకం అన్న మాచార్యులు షష్టీకరించారు శ్రీవేంకటేశ్వరునకు అన్వయించి -

నాకు జగత్తంతా తిరువేంకటేశుడే సాక్షాత్కరిస్తున్నాడు. ఆయనకు నిత్యమైన పూజ లు చేయనేర్చాను నేను. నా దేహమే శ్రీవారి ఆలయం. నా శిరము ఆ గుడి శిఖరం. నా హృదయమే శ్రీహరికి పీఠం. నా అంతర్ముఖ బహిర్ముఖ దృష్టులు అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణునకు దీపములు. నా పలుకే మంత్రము (అన్ని మంత్రములు యిందే ఆవహించెనూ. వెన్నతో నాకు గలిగే - వేంకటేశు మంత్రము అన్నారు వేరొక కీర్తనలో) నా నాల్క కల కలరవాలు చేసే పిడిఘంట పెద్ద గుడి గంట నీకు నా రసనవు షడ్రస గ్రసనం, నా తలపు నవరసవిలసనం, నా భావమంతా నిండిన స్వామికి నైవేద్యములు.

నా నడకలే ఆ దేవునకు ప్రదక్షిణాలు సక్తుడైన నాలోని జీవుడే పంచప్రాణాత్మకమై న జీవుడే - ఆ హరికి దాసుడు. నా ఉచ్ఛ్వాస నిశ్వాస క్రియలన్నీ ఆ పంచభూతాత్మకు డైన పరమాత్మునికి వింజామరలు అని తన జీవన జీవక్రియా సర్వస్వం శ్రీవేంకటేశ్వరు నకు నిత్యమానసిక పూజగా, త్రికరణ శుద్ధార్చనగా సమర్పించి శ్రీహరిని తనలో ఐక్యమొందించుకొని, అలరినాడు అన్నమాచార్యులు. శ్రీ శంకరుల శ్లోకానికి ఈ సంకీర్త నకూ ఉన్న సామ్య సామీచీన్యాలు గమనార్హములు.